

మంగళగిరి కేంద్ర కార్యాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబునాయుడును కలిసిన గెలుపొందిన ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరం, ప్రక్కన మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, మనోహర్



- తొలి ప్రాధాన్య ఓట్లలోనే 82,320 ఆధిక్యం
- రౌండురౌండుకూ భారీ మెజార్టీతో ప్రభంజనం
- తొమ్మిది రౌండ్ల అనంతరం అధికారిక గెలుపు ప్రకటన
- కలెక్టరేట్‌లో ఆలపాటికి డిక్లరేషన్ అందజేసిన కలెక్టర్
- బాణసంచా పేల్చి, స్వీట్ల పంపిణీ.. అంబరాన్ని అంటిన సంబరాలు
- 24 గంటల పాటు కొనసాగిన పట్టభద్రుల ఓట్ల లెక్కింపు

ఆలపాటి అఖండ విజయం

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అఖండ విజయాన్ని అందుకున్నారు. బరిలో సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నప్పటికీ ఒకవిధంగా ఈ ఎన్నికలు ఏకపక్షంగానే కొనసాగాయి. ఓటరు నమోదు ప్రక్రియ మొదలుకుని లెక్కింపు ముగిసేవరకు కూడా టీడీపీ హవానే కొనసాగింది. ఈ ఎన్నిక పీడీఎఫ్ చరిత్రలో గట్టి ఎదురుదెబ్బే తగిలింది. పట్టభద్రులు అందించిన తిరుగులేని విజయంతో టీడీపీపై రెండు ఉమ్మడి జిల్లాల ప్రజల్లో ఉన్న విశ్వాసం ఏమాత్రం చెక్కుచెదరలేదని స్పష్టమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు దాదాపుగా 24 గంటల పాటు కొనసాగింది. సోమవారం ఉదయం ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో ముగిసింది. తొలి రౌండ్ కౌంటింగ్‌లోనే ఆలపాటి 9980 భారీ మెజార్టీ సాధించారు. ఆ తర్వాత రౌండ్లలోనూ అదే ఒరవడి కొనసాగించడంతో మూడో రౌండ్ లెక్కింపు పూర్తి అయ్యేసరికే ఆలపాటి భారీ విజయం సాధిస్తారని తేలిపోయింది. దాంతో పీడీఎఫ్ ఏజెంట్లు ఒక్కొక్కరుగా కౌంటింగ్ హాల్ వీడారు. కాగా రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, డీఆర్‌వో ఖాజావలి పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ వేగవంతంగా సాగింది. 2వ రౌండ్‌లో 10785, మూడో రౌండ్‌లో 9318, నాల్గో రౌండ్‌లో 8408, 5వ రౌండ్‌లో 9381, 6వ రౌండ్‌లో 10184, ఏడో రౌండ్‌లో 9196, ఎనిమిదో రౌండ్‌లో 9699, తొమ్మిదో రౌండ్‌లో 5369 మెజార్టీ కలిపి (మిగతా 6వ పేజీలో)



మీడియా పాయింట్లో ఆలపాటి విజయ సంకేతం

ఆలపాటి రాజకీయ ప్రస్థానం

- 1985లో తెలుగు యువత నేతగా రాజకీయ ప్రవేశం
- 1994లో వేమూరు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యే.1999లో రెండోసారి వేమూరు నుంచి విజయంతో మంత్రి పదవి
- 2014లో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా విజయం.

కూటమిలో జోష్..

ఫలితాలతో వైసీపీ శిబిరం నిస్తేజం

వైసీపీ పాలనలో కళావిహీనమైన రాజధానికి కొత్త వెలుగులు తెచ్చి యావత్ ప్రపంచం దృష్టి ని ఆకట్టుకునేందుకు సీఎం చంద్ర బాబు నాయుడు వేస్తున్న అడుగులకు పట్ట భద్రులు మరింత బలం చేకూర్చారు. కూటమి అభ్యర్థికి ప్రత్యర్థిగా నిలబడిన అభ్యర్థి కంటే రెండు రెట్లు కు పైగా ఓట్లేసి అఖండ మెజార్టీతో గెలిపించి కూటమి ప్రభుత్వాన్ని ఓటర్లు ఆశీర్వదించారు. విశేషమేమిటంటే పోల్ అయిన ఓట్లలో 89 శాతం మాత్రమే చెల్లుబాటైనా అందులో 67.5 శాతం ఓట్లను కూటమి అభ్యర్థికి పడటంతో టీడీపీ, బీజేపీ, జనసేన కేడర్‌లో ఉత్సాహం ఉరకలేసింది. కాగా కూటమి అభ్యర్థిని ఓడిం చేందుకు వైసీపీ ముఖ్య నేతలు కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా ప్రయత్నించారు. ఇక ఏకంగా ఆ పార్టీ పత్రిక కూటమి అభ్యర్థిపై అబద్ధపు రాతలతో విషం చిమ్మినా విద్యావంతులు నమ్మలేదు. బరిలో ఉంది తమ పార్టీ అభ్యర్థి కాదని కేడర్‌కు ధైర్యం చెబు తున్నా కూటమి అభ్యర్థి సాధించిన ఘన విజయం తో వైసీపీ శిబిరంలో నిస్తేజం నెలకొంది. ఈ ఎన్ని కల్లో కూటమి అభ్యర్థి ఓడితే ప్రభుత్వంపై వ్యతిరేక త పెల్లుబుకిందని, రాజధాని ప్రాంతంలో ఆదరణ కోల్పోయిందని ప్రచారం చేయాలని వైసీపీ నేతలు చేసిన ఆలోచన ఫలితాలతో తలకిందులైంది.



కౌంటింగ్ కేంద్రం వద్ద బాణ సంచాతో సంబరాలు

సంక్షేమం.. సులభం

- అర్హులకు అందించేందుకు చర్యలు
- కొలిక్కివచ్చిన ఇళ్ల జియో ట్యాగింగ్ ప్రక్రియ
- బాపట్లలో 99 శాతం.. గుంటూరు, పల్నాడు జిల్లాలు వెనకంజే

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేస్తుంది. అయితే ఆ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందుతున్నాయా అంటే అనుమానమే. అనర్హులు కూడా ఎందరో సంక్షేమ ఫలాలు అందుకుంటున్నారని అధికారుల విచారణల్లో వెల్లడవుతోంది. ఈ పరిస్థితుల్లో కుటుంబాలు ఎన్ని.. వారి స్థితిగతులు ఏమిటి అనే డేటా ప్రభుత్వం వద్ద ఉంటే సంక్షేమాన్ని సులభంగా అందించవచ్చని కూటమి ప్రభుత్వం భావించింది. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా వైసీపీ అనుయాయులకు పెద్దఎత్తున లబ్ధి చేకూర్చారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమం అర్హులకు మాత్రమే అందించాలని నివాసాల జియో ట్యాగింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమాన్ని పక్కాగా అర్హులకే అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం దీని ద్వారా జిల్లాల వారీగా ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయి వాస్తవ లెక్కలు, ఎంతమంది స్థానికంగా నివాసం ఉండడం లేదనే గణాంకాలతో పాటు గత ప్రభుత్వంలో అర్హత లేకుండా ఎన్ని కుటుంబాలు సంక్షేమ ఫలాలు అందుకున్నాయనే వివరాలు ఈ జియో ట్యాగింగ్ ద్వారా వెల్లడి కానున్నాయి. ఇకపై కూటమి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలలో పారదర్శకత కోసం జియో ట్యాగింగ్ ప్రక్రియ దోహదకారిగా ఉండనుంది. గతేడాది నవంబరులోనే ఇళ్ల జియో ట్యాగింగ్‌ను సచివాలయ సిబ్బంది ద్వారా ప్రభుత్వం చేపట్టింది. ఇకపై సంక్షేమ పథకాల అమలులో జియో ట్యాగింగ్ డేటానే కీలకం కాబోతుందని అధికారులు చెబుతున్నారు. ఇళ్ల లెక్కతో పాటు కుటుంబసభ్యుల సంఖ్య, ఇతరాత్ర ఆర్థిక స్థితిగతులు, స్థానికంగా ఉండని వారెవరూ ఇలా అన్ని అంశాలు ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి అందుబాటులో వచ్చాయి. ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తి అయితే సంక్షేమ పథకాలు అర్హులకు అందించడం ప్రభుత్వానికి సులభంగా మారనున్నది. జియో ట్యాగింగ్ సహకారంతో ఎంత మంది అనర్హులు లబ్ధి పొందారన్న గణాంకాలు కూడా తేటతెల్లమవుతున్నాయి. పింఛన్లకు సంబంధించి ఇటీవలే వడపోత చేపట్టి అర్హులైన మరో 2,200 మందికి తాజాగా లబ్ధి చేకూర్చింది. ఉద్దేశపూర్వకంగా నిధులు కైంకర్యం చేసిన వారిపై అవసరమైతే రికవరీ యాక్టు అస్త్రాన్ని ప్రయోగించడానికి కూడా ప్రభుత్వం సిద్ధమవుతోంది. వీటికి ఊతంగా ఈ ఇళ్ల జియో ట్యాగింగ్ ప్రక్రియ నిదర్శనంగా నిలవనుంది. మరో వారం రోజుల్లో వంద శాతం పూర్తవుతుందని సంక్షేమం సులభతరం చేయడంలో జియో ట్యాగింగ్ ఉపయోగపడుతుందని యంత్రాంగం ఆశిస్తోంది. బాపట్ల జిల్లాలో 99 శాతం ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తవగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇంకా ట్యాగ్ కావాల్సిన ఇళ్ల (మిగతా 8వ పేజీలో)



నిజాంపట్నంలో ఇళ్లకు జియో ట్యాగింగ్ చేపడుతున్న సిబ్బంది (పాత చిత్రం)

పదివేల ఇళ్లు మాయం

నివాసాల జియో ట్యాగింగ్‌కు సంబంధించి సచివాలయ సిబ్బందికి వార్డుల వారీగా డేటా ఇచ్చి జియో ట్యాగింగ్‌కు పురమాయించారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ డేటాతో పోలే ఇళ్ల నెంబర్లు కనిపించడం లేదు. గత ప్రభు త్వంలో జరిగిన అవకతవకలకు ఇదే నిదర్శనంగా కనిపిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు పదివేల ఇళ్ల వరకు క్షేత్రస్థాయిలో లేకుండా రికార్డుల్లో చూపించారని సిబ్బంది గుర్తించారు. మరో వైపు ఏళ్ల తరబడి అక్కడ నివాసం ఉండకపోయినా లెక్కల్లో స్థానికంగానే ఉన్నట్లు చూపించిన కుటుంబాల సంఖ్య కూడా గణనీయంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

స్నాతకోత్సాహం



గుంటూరు వైద్య కళాశాల 74వ స్నాతకోత్సవం 'కార్డియా 25' జింకానా ఆడిటోరియంలో మంగళవారం జరిగింది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉప కులపతి, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం 2019 బ్యాచ్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. గ్రాడ్యుయేషన్ డేతో కళాశాలలో కోలాహల వాతావరణం నెలకొంది. 8

- గుంటూరు మెడికల్ (ఆంధ్రజ్యోతి)

7న మహిళా ఫిర్యాదు విండో

అన్ని పోలీస్‌స్టేషన్లలో వినూత్న కార్యక్రమం



గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యల పరిష్కారానికి 'మహిళా ఫిర్యాదుల విండో' అనే వినూత్న కార్యక్రమానికి పోలీసులు రూపకల్పన చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఈ నెల 7న మహిళా ఫిర్యాదుల విండో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రైనీ ఐపీఎస్ దీక్షా తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ రోజున తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కలిసి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. మార్చి 8న జరగనున్న మహిళా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.



సర్వమత స్వర్గధామం

- హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రం
- ఆధునిక వసతులు.. సకల సౌకర్యాలు
- తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డులో ఏర్పాటు
- నూతన సంస్కరణలకు తెరదీసిన సీఆర్‌డీఏ

రేపటి నుంచి గుడారాల పండుగ 8

7 నుంచి సాగరమాత ఉత్సవాలు 6

శంకరవిలాస్ ఆర్‌వోబీ పనులకు శ్రీకారం

- ప్రారంభమైన ప్రైవేటు భవనాల తొలగింపు
- 99 మంది భవన యజమానులకు నోటీసులు జారీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.30 (బుధవారం)

సహరి : 5.10 (గురువారం)

గుంటూరు కార్పొరేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. గత కొన్ని రోజులుగా ప్రైవేటు భవనాలు తొలగింపులు జరుగుతున్నాయి. నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు.. పురాతన ఆర్‌వోబీ స్థానంలో నూతన బ్రిడ్జి మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్‌వోబీ పనులు ప్రారంభించే క్రమంలో మార్కింగ్ ప్రకారం తొలుత భవనాలను అధికారులు తొలగిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణానికి ఇప్పటికే అనుమతులు మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన విస్తరణ పనులు వేగంగా చేపడుతున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణ ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో హిందూ కాలేజి నుంచి ఏసీ కాలేజి వరకు ఏ ఈఎల్సీ, ప్రభుత్వ భవనాలు, అరండల్‌పేట రెండు, పదో లేన్ల మధ్య ప్రైవేట్ భవనాలను తొలగించే కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడు తూ ఆర్‌వోబీ రోడ్డు విస్తరణ పనుల్లో బ్రాడీపేట, అరండల్‌పేట ప్రాంతాల్లో 134 ఆస్తులకు సంబంధించి 99 మంది భవన యజమానులకు నోటీసులు ఇచ్చామన్నారు. 14 ప్రభుత్వ, 21 మిషనరీ ఆస్తులకు నోటీసులు అందజేశామన్నారు. పలువురు ప్రైవేట్ భవన యజమానులు, ఏఈఎల్సీ ప్రతినిధులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగర పాలక సంస్థకు అందజేశారన్నారు. ఈ క్రమంలో భవనాల తొలగింపు పనులను వేగవంతం చేశామని తెలిపారు. విస్తరణలో మార్కింగ్ ప్రకారం వారి ఆస్తి విలువను బట్టి భవన యజమానులకు నష్ట పరిహారం, స్థలం విలువనకు 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లను అందిస్తామని తెలిపారు.



అరండల్‌పేట ఏడు, ఎనిమిది లైన్ల మధ్య ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ప్రైవేట్ భవనాలు



జగన్‌కు అంత సంపద ఎలా వచ్చింది ?

- అధికారం అండతో అడ్డగోలుగా దోపిడి
- అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఫైర్



మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డంపెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష కోట్ల రూపాయలకు పడగలెత్తారని, 2004 ఎన్నికల అఫడవిట్‌లో కేవలం రూ.2 కోట్ల ఆస్తులు చూపించిన వ్యక్తి అధికారంలోకి వచ్చాక 50 కంపెనీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జగన్ అధిపతి అయ్యాడని, ఇంత సంపద ఎలా వచ్చిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చావేదిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను దొరికిన కాడికి దోచుకోవడం, దాచు కోవడంతోనే సరి పుచ్చాడని, సంపద సృష్టి ఊసు లేకుండా రాష్ట్రాన్ని దివాళ తీయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడని, వారి ఐదేళ్ల పదవి కాలంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందన్నారు. పాఠశాలలకు ఇచ్చిన కోడిగుడ్లు, చిక్కీలకు వందల కోట్లు పెండింగ్ పెట్టారని సంక్షేమానికి రూ.2.7 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు సరే తెచ్చిన అప్పుల్లో మిగిలిన డబ్బులు ఏమయ్యాయో చెప్పాలన్నారు. జగన్ చేసిన అప్పుల ఫలితంగా అసలు, వడ్డీ కలుపుకొని ఏడాదికి రూ.60 వేల కోట్లు ఎన్‌డీఏ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లోనూ వికాసం వైపు అడుగులు వేసేలా బడ్జెట్ పెట్టడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చేయూతనిచ్చేలా రైతే రాజు అన్న మాటను నిజం చేసేలా కేటాయింపులు చేశారన్నారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రాజెక్టులన్నీ అటకెక్కాయని, కూటమి వచ్చాకే మళ్లీ అభివృద్ధిని పట్టాలు ఎక్కిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చొరవతో మళ్లీ కేంద్రం నుంచి అమరావతి, పోలవరానికి నిధులు వచ్చాయన్నారు. పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయబోతున్నామని, తిరిగి దేశంలోనే వ్యవసాయరంగాన్ని నంబర్ -1 చేయాలని సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు.

'మన మిత్ర' వాట్సప్ ద్వారా హాల్ టిక్కెట్లు

గుంటూరు(విద్య),మార్చి4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు మన మిత్ర వాట్సప్ ద్వారా హాల్‌టిక్కెట్లు పొందవచ్చునని గుంటూరు జిల్లా డీఈవో సివి రేణుక మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు 9552300009 అనే నంబర్‌కు హాయ్ అని మేసేజ్ చేసి లాగిన్ అయ్యి హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యం విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వాట్సప్ ద్వారా హాల్ టిక్కెట్లు తీసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

సాగర్ భూముల కబ్జాపై కదిలిన యంత్రాంగం

- వీపీ సౌత్‌లో ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- హద్దులు ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపినట్లు నిర్ధారణ
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కబ్జాకు గురైన భూమిలో ప్లాట్లును పరిశీలిస్తున్న అధికారులు

మాచర్ల టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాగర్ భూముల కబ్జాపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని సాగర్ కుడి కాలువ వద్ద గ్లోరీ క్రైస్ట్ చర్చి సమీపంలో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. కబ్జాకు గురైన స్థలంలో కొన్ని ఇళ్లు నిర్మించినట్లు మాచర్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఇరిగేషన్ శాఖ స్థలంలో హద్దులు ఏర్పాటు చేసి అమ్మకాలు జరిగినట్లు నిర్ధారించారు. మాచర్ల మండలం నాగులవరం గ్రామానికి చెందిన వైసీపీ నేత బూడిద శ్రీను, అనుములపురి రాధ, నాగార్జున సాగర్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు అర్జున్ ఈ భూదందాలో పాలుపంచుకున్నట్లు అధికారులు నిగ్గుతేల్చారు. నకిలీపత్రాలు సృష్టించి భూవిక్రయాలు జరిపి ఉంటారని వెల్లడించారు. కబ్జాదారుల ఇంటికి వెళ్లగా తాళాలువేసి అందుబాటులో లేరన్నారు. కబ్జాదారులపై తదుపరి చర్యలు ఉంటాయని, నివేదికను మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విజయపురి సౌత్ సచివాలయం సర్వేయర్ మనోజ్, వీఆర్వో రవికుమార్, ఇరిగేషన్ క్యాంపు గార్డు వెంకటేశ్వర్లు, వీఆర్‌ఏ రవి తదితరులు పాల్గొన్నారు.



సతీమణి మాధవితో కలిసి కలెక్టర్ నుంచి ఎమ్మెల్సీ డిక్లరేషన్‌ను అందుకుంటున్న ఆలపాటి, పక్కన కనపర్తి, కార్పొరేటర్ బుజ్జి తదితరులు

ఆలపాటి అఖండ విజయం

(5వ పేజీ తరువాయి)

మొత్తం 82320 ఓట్ల ఆధిక్యాన్ని ఆలపాటి సాధించారు. మొత్తం 2,41,774 ఓట్లకు 26909 ఓట్లు చెల్లుబాటు కాలేదు. 2,14,865 ఓట్లు చెల్లుబాటు కాగా అందులో 1,45,057ఓట్లు ఆలపాటికి, 62,737 ఓట్లు లక్ష్మణరావుకు పోలయ్యాయి. పోటీలో నిలిచిన మిగతా 23 మంది అభ్యర్థులకు కలిపి 7071 ఓట్లు వచ్చాయి. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చెల్లుబాటైన ఓట్లలో 50 శాతం కంటే తొలి ప్రాధాన్య ఓట్లలో ఒక ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఆ ప్రకారం 1,07,433 ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపొందుతారు. ఆలపాటికి కోటా కంటే 37,624 ఓట్లు అధికంగా వచ్చాయి. దాంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపొందినట్లు ప్రకటించి కౌంటింగ్ ప్రక్రియ ముగించారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆలపాటికి డిక్లరేషన్ ఫారంని అందజేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఆలపాటి సతీమణి మాధవి, టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, గవిని సతీష్, వేములపల్లి శ్రీరాంప్రసాదు, వందనదేవి, దాసరిరమణ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల సంబరాలు..

తొలి రౌండులోనే ఆలపాటి విజయంపై ఆశలు కలగడం.. రౌండు రౌండుకు విజయావకాశాలు బలపడడంతో తెలుగు తమ్ముళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మొదటి ప్రాధాన్య ఓటులోనే 82,320 ఓట్ల భారీ మెజారిటీ ఆలపాటి విజయ దుందుభి మోగించడం, మంగళవారం తెల్లవారు జామున ఆలపాటి విజయాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించడంతో తెలుగు తమ్ముళ్లు, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తల ఆనందం కట్టలు తెంచుకుంది. చిన్న పెద్ద అన్న తేడా లేకుండా నాయకులు, కార్యర్తలు అందరూ కలిసి సంబరాలు చేసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్దే ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంతోషాన్ని పంచుకున్నారు. ఆలపాటికి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం ఎదుట టపాసులు, బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని ప్రపంచానికి చాటారు.

నా విజయం.. కూటమి విజయం : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

గుంటూరు(తూర్పు): అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమంతోనే తన గెలుపు సాధ్యమైందని శాసనమండలికి కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్ర సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో డిక్లరేషన్ అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విజయం ఒక చరిత్ర అని, మంత్రి పదవిపై ఆలోచన లేదని తెలిపారు. శాసనమండలిలో గళం విప్పి, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను నమ్మిన ఓటర్లు 83 వేల మెజార్టీ ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. తనపై అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేసిన ప్రత్యర్థులకు ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌న్నారు.

విద్యా విధానాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని, దానిని గాడిలో పెట్టేందుకు నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో ఉపాధ్యాయులుకు సామాజిక గౌరవం ఇవ్వలేదని, చివరకి విశ్వవిద్యాలయాల్లో కూడా రాజకీయాలు చేసి కలుషితం చేశారన్నారు. యూనివర్సిటీలు రాజకీయాలకు నిలయాలుగా మారిన పరిస్థితుల్లో మార్పు తీసుకొస్తుంటే విమర్శలు చేస్తున్నారన్నారు. తాము యూనివర్సిటీలను ప్రత్యేక గురుకులాలుగా భావించామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ దామోదర్ నాయుడు

క్రీడలతో నూతనోత్సాహం

- రాష్ట్ర పశుసంవర్థక సంచాలకులు డాక్టర్ దామోదర్‌నాయుడు
- పశు వైద్యుల క్రికెట్ లీగ్ -2025 ప్రారంభం

గుంటూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మునిగిపోతున్న వారికి క్రీడలు నూతనోత్సాహాన్నిస్తాయని రాష్ట్ర పశు సంవర్ధక సంచాలకులు డాక్టర్ దామోదర్‌నాయుడు అన్నారు. మంగళవారం నాగార్జున యూనివర్సిటీ రోడ్డులోని డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశువైద్యుల క్రికెట్‌లీగ్-2025 నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దామోదర్‌నాయుడు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహారావులు మాట్లాడుతూ ఆట విడుపు కార్యక్రమాలు ఉద్యోగులకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల,మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రజనీకుమారి, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, సక్కు పౌల్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి వెంకట్ రామ్, స్వస్తిక్ ఫార్మా, వర్షా గ్రూప్ యాజమాన్యం పాల్గొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు క్రికెట్ లీగ్ పోటీలు కొనసాగుతాయని డాక్టర్ జయ ప్రకాష్ తెలిపారు.



సర్వేను అడ్డుకున్న వైకుంఠపురం రైతులు

భూ సర్వేను అడ్డుకున్న రైతులు

అమరావతి, మార్చి4(ఆంధ్రజ్యోతి) గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా మంగళవారం వైకుంఠపురంలో పంప్‌హౌస్1 నిర్మాణానికి అవసరమైన భూమికోసం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టగా రైతులు అడ్డుకున్నారు. ల్యాండ్ పూలింగ్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే సర్వేకు ఒప్పుకుంటామని స్పష్టం చేశారు. గతంలో తమ నుంచి తీసుకున్న అభిప్రాయాలపై ప్రభుత్వం స్పందించలేదని, స్పష్టమైన హామీ ఇస్తేనే భూములు ఇస్తామని రైతులు తెలిపారు. రైల్వేలైను, గోదావరి-పెన్నాకాలువ, ఇన్నర్‌రింగ్ రోడ్డు పేరిట తాము అధికంగా భూములు కోల్పోయే పరిస్థితి రానుందని, దీంతో పాటు ఈనాం భూముల సమస్య కూడా అధికంగా ఉందని రైతులు తెలియజేశారు. దీంతో సర్వే సిబ్బంది సర్వే పనులు ప్రారంభించకుండానే వెనుదిరిగి వెళ్లి పోయారు.



రుణ మంజూరు లేఖలను అందజేస్తున్న బిజు వాసుదేవన్

రుణాల మంజూరులో క్రెడిట్ స్కోర్‌కే అధిక ప్రాధాన్యం

గుంటూరుసిటీ, మార్చి4(ఆంధ్రజ్యోతి): రుణాల మంజూరు సమయంలో క్రెడిట్ స్కోర్‌కే అధిక ప్రాధాన్యం ఉంటుందన్న విషయాన్ని గుర్తించుకోవాలని యూనియన్ బ్యాంక్ ముంబై సెంట్రల్ ఆఫీసు చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్ అన్నారు. మంగళవారం గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ మెగా అవుట్‌రీచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యూనియన్ బ్యాంకు ఎంఎస్‌ఎంఈ పథకాలను వివరించారు. లబ్ధిదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ముఖ్యమన్నారు. ఎంఎస్‌ఎంఈ అవుట్ రీచ్ కార్యక్రమం సందర్భంగా రూ.150 కోట్ల విలువైన మంజూరు లేఖలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు రీజియన్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ పోటీలకు

దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యూత్ పార్ల మెంట్ పోటీల్లో పాల్గొనేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కెవి.బ్రహ్మం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయస్సు లోపు వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఒక్క నిమిషం నిడివి కలిగిన 'వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ' అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 9వ తేది అర్ధరాత్రిలోగా మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇలా వచ్చిన వీడియోల్ని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ఐదు జిల్లాల నుంచి ఎంపికైన 150 మంది విద్యార్థులకు జిల్లాస్థాయిలో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో పోటీ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలో 'వన్ నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వే ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై 3 నిమిషాలు మాట్లాడాలని తెలిపారు. వివరాల కోసం 9177753393 అనే నంబరుని సంప్రదించాలని సూచించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. డబ్బులు చెల్లిస్తాను

- పెన్షన్ డబ్బులతో పరారైన సచివాలయ ఉద్యోగి
- సెల్ఫీవీడియో సందేశం ద్వారా దాచేపల్లి కమిషనరు, కలెక్టరుకి విజ్ఞాపన
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకున్నానని వెల్లడి




సెల్ఫీ వీడియోలో అధికారులను వేడుకుంటున్న సచివాలయ ఉద్యోగి లక్ష్మీప్రసాద్

దాచేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. నెల రోజుల్లో డబ్బులు చెల్లిస్తాను. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బు పెట్టి మోస పోయాను. ఒక్క అవకాశం ఇవ్వండి మళ్లీ ఇలాంటి తప్పు జరుగకుండా చూసుకుంటాను' అని పించన్ నగదుతో పరారైన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సంపతి లక్ష్మీ ప్రసాదు దాచేపల్లి కమిషనర్, పల్నాడు జిల్లా కలెక్టరుకి విజ్ఞాపన చేస్తూ మంగళవారం సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన రూ.11 లక్షలతో ఈ నెల 1న పరారై ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. ఈ ఘటనపై దాచేపల్లి కమిషనర్ అప్పారావు దాచేపల్లి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ పరిస్థి తుల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ విడుదల చేసిన సెల్ఫీ వీడియో కలకలం రేపింది. ఆ వీడియోలో తానుచేసిన తప్పును ఒప్పుకుంటూ పశ్చాతాపం వ్యక్తం చేశాడు. రెండు రోజులుగా తన భార్య, పిల్లలు ఏమి తినలేదని, ఒకానొక సమయంలో ఆత్మహత్య చేసుకోవటానికి సిద్ధ పడ్డామని ఆవేదన వ్యక్తం చేశాడు. తన తల్లిదండ్రులతో మాట్లాడి డబ్బులు తిరిగి చెల్లిస్తానని ఆ వీడియోలో లక్ష్మీ ప్రసాదు తెలిపాడు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

నరసరావుపేట లీగల్, మార్చి 4, (ఆంధ్రజ్యోతి), మూడు చోరీ కేసుల్లో నేరం రుజువుకావడంతో నిందితుడు నాదెండ్ల మండలం కనపర్తి గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల బాలయేసుకు ఒక్కొక్క నేరంలో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి, ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి రెడ్డి ఆశీర్వాదంపాల్ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గత ఏడాది నవంబరు 19న పట్టణంలోని జిబిఆర్ వైద్యశాల వద్ద రొంపిచర్ల మండలం బుచ్చి బాపన్నపాలెం గ్రామానికి చెందిన ఓర్సు కృపారావు ద్విచక్ర వాహనం, రామిరెడ్డి పేటలోచెందిన షేక్ మహబూబ్ సుభాని గీత మందిర్ వద్ద కంభంపాటి వెంకట చలమయ్యలకు చెందిన ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడు బాలయేసును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రందాఖలు చేశారు. నిందితుని వద్ద నుంచి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. కేసును సీఐ ఎంవి.చరన్ ఆధ్వర్యంలో ఎస్ఐ అరుణ దర్యాప్తు చేశారు. కోర్టు కానిస్టేబుల్ విన్నెబోయిన దుర్గయ్య సాక్షులకు తర్ఫీదు ఇచ్చి కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్‌ను సీనియర్ ఏపీపీ. లక్ష్మీ రాం నాయక్ నిర్వహించారు .

7 నుంచి సాగరమాత ఉత్సవాలు



సాగరమాత, జపమాల స్మారక గుడులు

మాచర్లరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెంతనే కృష్ణమ్మ పరవళ్లు.. చూడగానే మనస్సుకి ప్రశాంతత చేకూరే ఆలయాలు.. ఎంతో ఆహ్లాదకరమైన ప్రకృతి.. ఇది మాచర్ల మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయ విశిష్టత.. అనునిత్యం ఎంతో మంది ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు.. తమ మొక్కులు చెల్లించుకొని ఆ తల్లి చల్లని దీవెనలు పొందుతారు.. ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. సాగరమాత పుణ్యక్షేత్రంలో భక్తులు స్నానమాచరించేందుకు పుష్కరఘాట్ ఉంది. తలనీలాలు సమర్పించేందుకు ప్రత్యేక షెడ్డు, రాత్రి వేళ బస చేసేందుకు విశాలమైన ప్రాంగణం ఉంది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రత్యేక సదుపాయం కలదు. ప్రతి ఆదివారం ఈ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. తేరు ప్రదిక్షణ గావిస్తారు. ప్రతియేటా మార్చి 7, 8, 9 తేదీల్లో సాగరమాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం విశేషం.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై చర్యలు

● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



సచివాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం శ్యామలనగర్‌లోని 99, 100, 101, 102, 103, 104 వార్డ్ సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కమిషనర్ తొలుత హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి సచివాలయ కార్యదర్శుల హాజరు సక్రమంగా లేకపోవడం, పని వేళల్లో మూమెంట్ రిజిష్టర్‌లో నోట్ చేయకుండా వెళ్ళడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి వార్డు సచివాలయాలు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, కార్యదర్శులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించకుంటే చర్యలు తప్పవన్నారు. సచివాలయం పరిధిలో ఇంటి, కుళాయి పన్నులను నూరు శాతం వసూళ్ల చేయడంలో కార్యదర్శులు సంయుక్త కృషి చేయాలని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ వి.శ్రీనివాసరావు, నోడల్ అధికారి లీలారాణి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకర్లు ప్లాంట్‌లోనే అన్‌లోడ్ చేయాలి : కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని సెప్టిక్ ట్యాంకర్లు తప్పనిసరిగా నగరపాలక సంస్థ ఫీకల్ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌లోనే అన్‌లోడ్ చేయాలని, రోడ్ల పక్కన, డ్రెయిన్లలో చేస్తే భారీ అపరాధ రుసుం విధిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ సుద్దపల్లి డొంకరోడ్డులోని జీఎంసీ ఎఫ్ఎస్టీపీని మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు తప్పనిసరిగా ఇళ్లల్లోని సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి తోడిన వ్యర్థాలను నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపీకే తీసుకొచ్చి ట్రీట్మెంట్ జరిగేలా సహకరించాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏఈ రవికిరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూరు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ లక్ష్మీనారాయణపురం, శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో స్వామి వారి 79 వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, సేవా కాలం, మంగళశాసనం,



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పూర్ణాహుతి తదితర సేవలను అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రపు సేవల్లో ప్రబంధ, వేద పారాయణలు, అనంతరం స్వామి వారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్ని ఆలయ కమిటీ నిర్వాహకులు సీతారామానుజాచార్యస్వామి అనంత సత్యధర్మచార్యస్వామి పర్యవేక్షించారు.

30న సినీ గీతాల పోటీలు

గుంటూరు(తూరు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 30న భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక అమరావతి రోడ్డు, అన్నదాన సమాజంలో రాష్ట్ర స్థాయి సినీగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్టు కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన గాయకులు 94401 09795 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఆటో డ్రైవర్ల నిరసన

గుంటూరు(తూర్పు), మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో కార్మికునికి రూ.15 వేలు ఇవ్వాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగ శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న నిత్యవసర ధరలుతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తక్షణమే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిరసనల్లో కూరాకుల రాంప్రసాద్, ఆరేటి రామారావు, చంద్రశేఖరరావు, గోవిందరాజు, శ్రీనివాసు, బాబురావు, శివ, యూసఫ్ పాల్గొన్నారు.

కూలీ రేట్ల పెంపుపై హర్షం

గుంటూరు(తూర్పు), మార్చి 4(ఆంధ్రజ్యోతి): కిరాణ ముఠా కార్మికులకు కూలీ రేట్లును 13 శాతం పెంపుదల చేయడంపై ఏఐటీయూసీ హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఏటుకూరు రోడ్డులోని రేగుల రాఘవయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఠా కార్మికులకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి కూలీ రేట్ల పెంపుదల జరుగుతుందని, ఇందులో భాగంగా కూలీ రేట్లు పెంచారని అన్నారు. కార్మికులు 50 కేజీలకు మించి బరువు మోయకూడదన్న తీర్మానాన్ని అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని విమర్శించారు. దీనిపై ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జి.సురేష్ బాబు, రావుల అంజిబాబు, కొండా వెంకటేశ్వర రెడ్డి, ఆదిబాబు, పప్పుల రోశి రెడ్డి, కొంగలి కోటయ్య తదితరులు పాల్గొన్నారు

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతినగర్, శ్రీ మారుతి దేవాలయంలో 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సామూహిక లలితా సహస్రనామ సహిత కుంకుమార్చనలు జరిగాయి. అనంతరం శ్రీ సురక్షరాజ సమేత ప్రసన్నాంజనేయ స్వామి సామూహిక శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామికి లక్ష నాగవల్లి దళార్చన భక్తి శ్రద్ధలతో జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బ్రహ్మ ముప్పవరపు సింహాచలశాస్త్రిచే శ్రీరామ కరుణామృతం హరికథ గానం చేశారు. కార్యక్రమాల్ని కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పోలీస్ కస్టడీకి సాయి సాధన నిర్వాహకులు

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళను 12 కోట్లు మోసం చేసిన కేసులో రియల్ వేస్టేట్ సంస్థ నిర్వాహకులను మరోసారి పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం మూడు గంటల నుంచి బుధవారం సాయంత్రం మూడు గంటల వరకు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో విచారించనున్నారు. ప్రస్తుతం వారిరువురు ఈ కేసులో అరెస్ట్ అయి జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. సాయి సాధన చిట్ ఫండ్ పేరుతో వారు ఇప్పటికే నరసరావుపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 200 కోట్ల వరకు చిట్‌ఫండ్ మోసాలకు పాల్పడినట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే నరసరావుపేటలో కేసు కూడా నమోదైంది. కాగా రెండు రోజుల క్రితం పెద్ద సంఖ్యలో బాధితులు సీఎం చంద్రబాబును అసెంబ్లీ సమీపంలో కలిసి ఫిర్యాదు చేశారు. అయితే వారు ప్రజల నుంచి వివిధ రూపాల్లో వసూలు చేసిన కోట్ల రూపాయల సొమ్ము ఏమైందనే దానిపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థినులతో డాక్టర్ రాజకుమారి, డాక్టర్ అపర్ణ తదితరులు

గర్భాశయ కేన్సర్ నివారణపై దృష్టి సారించాలి

గుంటూరు మెడికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఫాక్సీ, గుంటూరు గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం సంపూర్ణ అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ అపర్ణ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. గర్భాశయ ముఖద్వార కేన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. యువతులు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తాన

గుంటూరు, మెడికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఫాక్సీ, గుంటూరు స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణుల స్థానిక సంఘాల సమాఖ్య, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మలినేని పెరుమాళ్ల ఫార్మసీ కళాశాలలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తాన మంగళవారం సంపూర్ణ శక్తి అనే కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణతో పాటు అనారోగ్య సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలను డాక్టర్ షమా సుల్తాన వివరించారు. ప్రతి ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. కుటుంబ సంరక్షణ విషయంలో పడి మహిళలు తమ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నట్లు ఆమె తెలిపారు. తాము బాగుంటేనే కుటుంబం బాగుంటుందనే విషయం గుర్తించి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ షమా సుల్తాన సూచించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, బోధన సిబ్బంది రాజేష్, సౌజన్య, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసీ విద్యార్థినులతో డాక్టర్ షమా సుల్తాన

నారాయణ ఒలంపియాడ్‌లో సైన్సు ఎక్స్‌పో

గుంటూరు(విద్య), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ఉన్న నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో మంగళవారం సైన్సు ఎక్స్‌పోను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన వివిధ పరికరాలను, ఆకృతులను ప్రదర్శించారు. ప్రస్తుత కాలపు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూపొందించిన డ్రోన్లు, సోలార్ కార్లు పలువురిని ఆకర్షించాయి. ఆయా నమూనాలు తయారు చేసిన విద్యార్థులు వాటి ప్రాధాన్యతను చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఓ స్టేట్ కో ఆర్డినేటర్ ఎస్.రవి కుమార్, ఒలంపియాడ్ కో ఆర్డినేటర్ సీతారామయ్య, సాఫ్ట్ స్కిల్స్ రీజనల్ కోఆర్డినేటర్ నర్రా శ్రీను, ఏజీఎంలు కె.వెంకటేశ్వరరావు, డి.శివ నాగరాజు, లక్ష్మణరెడ్డి, జానకి రామిరెడ్డి, కె.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి తయారు చేసిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీవో స్టేట్ కో ఆర్డినేటర్ ఎస్.రవి కుమార్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులు

నకిలీ డ్వాక్రా సంఘాలు సృష్టించి జీడీసీసీ బ్యాంకుకు టోకరా

● వెంగళాయపాలేనికి చెందిన నకిలీ డ్వాక్రా గ్రూపులపై కేసు నమోదు

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి తద్వారా జీడీసీసీ బ్యాంకు నుంచి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన ఘటనపై డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన కొందరు 11 నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి వాటి పేరుతో జీడీసీసీ బ్యాంకు నల్లపాడు బ్రాంచ్ నుంచి కోటి 16 లక్షలు స్వాహా చేశారు. సారా మహిళా గ్రూప్, సాంబశివ మహిళా గ్రూపులు ఒక్కొక్కరు రూ.10 లక్షలు చొప్పున రూ.20 లక్షలు రుణంగా తీసుకున్నారు. షాలోము మహిళా గ్రూపు పేరుతో ఏడు లక్షలు తీసుకోగా, హోసన్న మహిళా గ్రూపు, తస్లీమ్ మహిళా గ్రూపు, షిరిడి సాయిబాబా మహిళా గ్రూపు, స్వర్ణ మహిళా గ్రూపు, రక్షిత మహిళా గ్రూపు, దీవెన మహిళా గ్రూపు, ఇందిరా మహిళా గ్రూపులు ఒక్కో గ్రూప్ పేరుతో రూ.10 లక్షలు తీసుకున్నారు. హోసన్న మహిళా గ్రూపు మాత్రం 14 లక్షలు తీసుకుంది. ఈ విధంగా 11 గ్రూపులను సృష్టించి వాటి పేరుతో కోటి 16 లక్షలు తీసుకున్నారు. దీనిపై డీఆర్డీఏ పీడీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

● అధికారుల తీరుపై శాసన సభలో ఎమ్మెల్యే నసీర్



శాసన సభలో ప్రసంగిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మకమైన పారిశ్రామిక విధానాలు, పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని, అప్పుడే ప్రభుత్వం ఆశించిన ఫలితం వస్తుందని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. గుంటూరు ఆటోనగర్లో మోటారు వాహన వ్యాపారులు అధికంగా ఉన్నారని, ఆ ప్రాంతం మరింత పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం చేయూతతోపాటు అధికారుల సహకారం అవసరమని వివరించారు. 2024-25 రాష్ట్ర బడ్జెట్ గత ఐదేళ్ల విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీర్చిదిద్దేలా రూపుదిద్దేలా బడ్జెట్ ఉందని కొనియాడారు. బడ్జెట్లో అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యమిస్తూనే ప్రజారంజకంగా కూర్పు చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏపీ రాజధాని ఏది అని గూగుల్‌లో సెర్చ్ చేసినా చెప్పలేని పరిస్థితి అని, ప్రస్తుతం చిన్న పిల్లవాడిని అడిగినా రాజధాని అమరావతి అని చెబుతున్నారని చెప్పారు. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా సామాజిక పింఛన్లను పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల నిధులను గత ప్రభుత్వం దుర్వినియోగం చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తోందని తెలిపారు. గృహ నిర్మాణాలకు నిధుల పెంపు, పీ4 మోడ్‌లో అభివృద్ధి, తెలుగుభాషాభివృద్ధికి నిధుల కేటాయింపు, డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ టీమ్ ఏర్పాటు, మహిళలను మహారాణులను చేసేలా దీపం-2 పథకం, మధ్యాహ్న భోజన పథకానికి నిధుల కేటాయింపు, టెంపుల్ టూరిజం డెవలప్‌మెంట్, వైద్యానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయింపుపై, పారిశ్రామిక ప్రగతిపై ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో మైనారిటీలకు కేటాయించిన నిధులపై సంతోషం వ్యక్తం చేస్తూనే, మరింత నిధులు కేటాయించాలని సభకు విన్నవించారు.

విజన్-2047కు తగిన విధంగా రాష్ట్ర బడ్జెట్

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



శాసన సభలో ప్రసంగిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్- 2047కు తగిన విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆమె బడ్జెట్‌పై ప్రసంగించారు. సవాళ్ళను అధిగమించి, ప్రగతికి బాటలు వేసే విజినరి లీడర్ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళుతోందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని, వైసీపీ తన అసమర్థతతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసిందని ఆమె విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో 10 సూత్రాలతో విజన్-2047 పెట్టుకోవడం అంటే ఓర్పు, నేర్పు, శ్రమతో కూడుకున్న ప్రయాణమని ఆమె కొనియాడారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట వేస్తూ రూ.31,805 కోట్లు పాఠశాల విద్యకు, రూ.2,506 కోట్లు ఉన్నత విద్యకు కేటాయించడం భావితరాలకు బాటలు వేయడమేనన్నారు. రూ.19,264 కోట్లు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమానికి కేటాయిస్తూ ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కేటాయించడం చంద్రబాబు పరిపాలన దక్షతకు అద్దం పడుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను అణచివేసిందని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం రూ.47,450 కోట్లు కేటాయించి ప్రభుత్వం బీసీలపై చిత్తశుద్ధిని చాటుకుందని అన్నారు.



నవగ్రహ, మహా సుదర్శన హోమాలు నిర్వహిస్తున్న టీటీడీ వేద పండితులు

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం టీటీడీ ఆగమశాస్త్ర పండితుల ఆధ్వర్యంలో కుంభారాధన, నవగ్రహ, మహా సుదర్శన హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన హనుమత్ వాహనంపై ఉభయ దేవి సమేతుడైన స్వామిని కన్నులపండువగా నగరోత్సవం ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

కార్యక్రమాలకు సాహితీవేత్త నోరి కోదండరామ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య అధ్యక్షత వహించారు. ఉత్తర కాశి సూర్య భాస్కరేంద్ర సరస్వతి స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహబాషణం చేయగా, సాహితీవేత్త కేవీ కోటేశ్వరరావు మహాకుంభాభిషేక విశేషాలను వివరించారు. సభలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గోరంట్ల పున్నయ్య చౌదరి, కొర్రపాటి రామారావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

ఉత్సాహంగా మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు

గుంటూరు(తూరు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎన్జీవో హోమ్ మైదానంలో మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా మహిళా ఉద్యోగ విభాగం చైర్మన్ రాధారాణి, కన్వీనర్ లక్ష్మీరమ్య, జాయింట్ సెక్రటరీ శివజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ టగ్ ఆఫ్ వార్, బాల్ బాస్కెట్ అంశాలలో పోటీలు జరిగాయి. పోటీలలో దాదాపు 200 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్యాం సుందర శ్రీనివాస్ రాజశేఖర్, వెంకట రెడ్డి, సుకుమార్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో ఎరుకల సామాజికవర్గానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన మరకా వినయ్(18)ను కఠినంగా శిక్షించాలని బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి 5 ఎకరాల భూమి, ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జీఆర్ భగత్ సింగ్, రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఎరుకల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఊసవరపు వెంకటేశ్వర్లు వున్నారు.







హిందువుల దహనవాటిక



తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డు వెంబడి ఏర్పాటవుతున్న స్మార్ట్ అంత్యక్రియలకేంద్రం



డీప్ ఏసీ ఫ్రీజర్ రూమ్

- హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రం
- ఆధునిక వసతులు.. సకల సౌకర్యాలు

సర్వమత.. స్వర్గధామం!

- తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డులో ఏర్పాటు
- నూతన సంస్కరణలకు తెరదీసిన సీఆర్‌డీఏ

దేశంలో అన్ని మతాల వారికి కలిపి ఒకేచోట మహాప్రస్థానాన్ని ఆధునిక సౌకర్యాలతో సర్వాంగసుందరంగా నిర్మిస్తున్న ఘనతను నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగరం దక్కించుకుంది. మరణానంతరం ఒకే మరు భూమి నుంచి కానరాని లోకాలకు వెళ్లే ఓ సరికొత్త శకానికి అమరావతి శ్రీకారం చుట్టింది. ఏపీ సీఆర్‌డీఏ అధికారులు నవ్యరాజధాని అమరావతిలో ఈ సరికొత్త ప్రయోగానికి తెరదీశారు. మరో నెల రోజుల వ్యవధిలో పూర్తికానున్న ఈ స్మార్ట్ అంత్యక్రియల కేంద్రం వినియోగంలోకి వచ్చాక... వెల్లడయ్యే ఫలితాలను బట్టి రాజధాని అమరావతి ఏరియాలో మరో నాలుగు కేంద్రాలను ఇదే తరహాలో ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. దేశంలో తొలిసారిగా చేపట్టిన ఈ స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రాన్ని తుళ్లూరు నుంచి గుంటూరు వచ్చే రోడ్డుమార్గానికి చేరువగా శాఖమూరు రోడ్డు వెంబడి ఎనిమిదెకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

సమాజంలో సుదీర్ఘకాలం పాటు శ్మశానాలపై ఓ రకమైన ఏదో తెలియని ఏహ్యాభావం పాతుకుపోయి ఉంది. కాలగతిలో విజ్ఞాన వికాసాలు గుభాళిస్తూ వచ్చిన నేపథ్యంలో శ్మశానాల పట్ల ఉన్న బావాలు పూర్తిగా మారుతూ వచ్చాయి. శ్మశానమంటే ప్రతి మనిషికి శాశ్వత నివాస స్థానమన్న కొత్త ఒరవడి వచ్చింది. అందుకే శ్మశానాల అసహ్యకర వాతావరణ పరిస్థితుల నుంచి బయటపడి సుందరమైన నందనవనాల మాదిరి ఉండాలన్న ఆకాంక్ష సమాజంలో క్రమంగా మొదలైంది. మన రాష్ట్రం వరకు చూస్తే ఈ సరికొత్త విప్లవాత్మకమైన ఆలోచనలకు తొలుత రాజమండ్రి నగరం శ్రీకారం చుట్టింది. ఇక అక్కడి నుంచి అది క్రమేపీ అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తూ ప్రస్తుతం అద్భుతమైన, అమోఘమైన, ఆశ్చర్యకరమైన సంస్కరణలకు దారితీసింది.

స్మార్ట్ సిటీ నిధులతో..

రాజధాని అమరావతి నగరం రాబోయే రోజుల్లో ఎన్నో ప్రత్యేకతలకు నిలయంగా మారనుంది. అందులో ఇది కూడ ఓ ప్రత్యేకమైందే. 2015-16లో కేంద్రం ప్రారంభించిన స్మార్ట్ సిటీ మిషన్ పథకం కింద రాష్ట్రంలోని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతి నగరాలు మూడు దశలుగా ఎంపికయ్యాయి. వాటిలో మూడో దశ కింద 2017లో ఎంపికైన అమరావతికి సుమారు రూ.120 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు 2019 తరువాత విడుదలై మురిగిపోతున్న దశలో సీఆర్‌డీఏ అధికారులు రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాలలో శ్మశాన భూముల సమస్యను పరిష్కరించే విధంగా వినియోగించాలని నిర్ణయించారు. దీనినే కొంచెం వినూత్నంగా ఆలోచించి స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రాల ఏర్పాటుకు పథకం రచన చేశారు. అందులో భాగంగానే తొలుత తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డులో సుమారు ఎనిమిదెకరాల విస్తీర్ణంలో రూ.9.48 కోట్ల వ్యయంతో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల వారిని కలిపి ఒకే ఐక్య స్మార్ట్ అంత్యక్రియల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులు దాదాపు తుదిదశకు వచ్చేశాయి. మరో నెలరోజుల్లో ప్రారంభానికి సిద్ధం కానుంది.

దక్షిణ భాగం హిందువుల కోసం..

శాఖమూరు రోడ్డులో ఎన్-14, ఈ-8 జంక్షన్ వద్ద ఇది రూపుదిద్దుకుంటుంది. ముఖద్వారాన్ని దాటి ముందుకు వెళ్లగానే కుడి పక్క, ఎడమ పక్క ఒకే తరహాలో ఉండే రెండు భవనాలను నిర్మించారు. కుడిపక్క భవనాన్ని పరిపాలనా భవనంగా, ఎడమపక్క భవనాన్ని భోజనాల నిమిత్తం వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశారు. లోపలిపక్క మొత్తం స్థలానికి మధ్య ప్రాంతాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించి దక్షిణ భాగం మొత్తాన్ని హిందూ శ్మశాన వాటికగా వేరు చేశారు. ఇందులో ఓ వైపు దహన వాటిక (కట్టెలతో కాల్చేందుకు)తో పాటు బంధుమిత్రులు కూర్చొని వీక్షించేందుకు వీలుగా రెండు కాంక్రీట్ షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. దీనికి ముందు వైపు ఎలక్ట్రిక్ మిషన్‌తో దహనం చేసేవిధంగా మరో స్థలిని, దానికెదురుగా ఖననం చేసేందుకు కొంత జాగాతో కూడిన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. వీటికి చేరువలోనే పిండ ప్రధానస్థలిని ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా మొత్తం ప్రాంగణంలో దక్షిణంగా ఏర్పాటవుతోంది.



భోజనశాల భవనం

ఉత్తరంగా కబరస్తాన్... బరియల్ గ్రౌండు

ఉత్తరదిశలో క్రైస్తవ, ముస్లింల శ్మశాన వాటికలను వారివారి సంప్రదాయాలకు అనుగుణంగా వేర్వేరుగా నిర్మించారు. ఈ మూడు రకాల శ్మశాన వాటికలకు సమీపంలోనే టాయ్‌లెట్స్‌తో కూడిన స్నానాల గదులను మూడు వేర్వేరు భవనాలుగా ఏర్పాటు చేశారు. ఈ మొత్తం శ్మశానస్థలికి పూర్తిగా పశ్చిమంగా ఉన్న మొత్తం ప్రాంతాన్ని గ్రీనరీకి కేటాయించారు. శ్మశాన స్థలిలో 30 శాతానికి పైగా స్థలాన్ని గ్రీనరీకే కేటాయించారు. ప్రస్తుతానికి ఈ గ్రీనరీ పనులు ఇంకా మొదలు కాలేదు. అంత్యక్రియల సందర్భంగా వినియోగించే వస్తువుల కోసం బయట మార్కెట్‌కు వెళ్లకుండా ఇక్కడే అన్ని మతాలవారికి వారివారి సంప్రదాయాలను అనుసరించి వాడే వస్తు, పదార్థాలన్నింటిని అందుబాటులో ఉంచారు. ఇందుకోసం కొన్ని అంగళ్లను ఇందులోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. విదేశాలు లేదా దూర ప్రాంతాల నుంచి బంధువులు చివరి చూపు కోసం రావడం ఆలస్యమైతే ఆ మృతదేహం పాడవకుండా కొన్ని రోజుల పాటు భద్రంగా ఉంచేందుకుగానూ ఈ ప్రాంగణంలోనే ఓ డీప్ ఏసీ ఫ్రీజర్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఎటువైపు వెళ్లాలన్నా అన్నీ సిమెంటు రోడ్లు, పార్కింగ్ టైల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇన్ని సౌకర్యాలు, వసతులతో ఆహ్లాదకరంగా ఉండేలా ఈ స్మార్ట్ అంత్యక్రియల కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. కేంద్రం నిర్వహణకు అవసరమయ్యే విద్యుత్ కోసం సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు.

త్వరలో మందడం, నవులూరులోనూ..

రాజధాని అమరావతిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ స్మార్ట్ అంత్యక్రియల కేంద్రం ప్రారంభోత్సవం తరువాత ఆశించిన ఉత్తమ ఫలితాలను ఇస్తే దానిని రాజధాని ప్రాంతంలోని మిగిలిన గ్రామాలకు కూడ విస్తరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ప్రస్తుతానికి ఈ కేంద్రాన్ని తుళ్లూరు, దొండపాడు, అబ్బురాజుపాలెం, శాఖమూరు, నేలపాడు గ్రామాల వారు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తరువాత రెండో దశలో మందడం, నవులూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ ప్రతిపాదించింది. మూడో దశలో మిగిలిన గ్రామాలకు మరో రెండు వేర్వేరు ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధంగా సీఆర్‌డీఏ ప్రణాళికను రూపొందించుకుంది.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్రహం, చిత్రంలో జాన్‌వెస్లీ, అనిల్

ప్రభువు ప్రేరణతోనే గుడారాల పండుగ

- హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం
- రేపటి నుంచి గుడారాల పండుగ

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) ఏసు ప్రభువు ప్రేరణతోనే 48వ హోసన్నా గుడారాల పండుగ అమరావతి మండలం లేమల్లె గ్రామంలోని హోసన్నా దయాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం తెలిపారు. మంగళవారం దయాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ అనిల్‌తో కలసి మాట్లాడారు. హోసన్నా మినిస్ట్రీస్ 1977సంవత్సరంలో హోసన్న నెల్లూరు నుంచి వచ్చి లేమల్లె గ్రామంలో సేవ ప్రారంభించారని అన్నారు. 47సంవత్సరాల పాటు జరిగిన గుడారాల పండుగలో వివిధ శాఖల అధికారులు, పత్రికా మిత్రులు, ప్రజాప్రతినిధులు, హోసన్నా మినిస్ట్రీస్ సేవకులు అందించిన సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 6నుంచి 9వ తేదీవరకు నిర్వహించే 48వ గుడారాల పండుగను మరింతగా విజయవంతం చేసేందుకు 140ఎకరాలలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ, రైల్వే శాఖలు కూడా ఈ పండుగకు పూర్తి సహకారం అందించి విశ్వాసులకు మెరుగైన రవాణా ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. పండుగకు 20లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పండుగకు హాజరయ్యేవారికి తాగునీరు, చలువ పందిళ్లు, స్క్రీన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరవుతారన్నారు. 5వ తేదీ సాయంత్రం మందిరాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. పండుగ ముగింపు రోజు దయా క్షేత్రం నుండి నేరుగా ప్రముఖ పట్టణాలకు విశ్వాసులను గమ్యాలకు చేర్చేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల నడుపుతుందన్నారు. రైల్వే కూడా పది కోచ్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు.



చక్కెరకేళి.. భళా

- కాసులు కురిపిస్తున్న గెలలు
- ఆనందంలో అరటి రైతులు

కొల్లిపర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతిపెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధిచెందిన కొల్లిపర మార్కెట్‌కు ప్రస్తుతం అరటి గెలలు అతి తక్కువగా వస్తున్నాయి. దీంతో అరటి గెలల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా అరటి గెలల ధరలు పలకటంతో రైతులు ఆశ్చర్య పోతున్నారు. ఈ మార్కెట్‌లో సీజన్‌లో ప్రతి రోజూ సుమారు అయిదు వేల నుంచి ఆరువేల వరకు అరటి గెలలు క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. అటువంటిది కృష్ణానదికి వచ్చిన వరదలు కారణంగా అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్‌కు అతి తక్కువగా గెలలు వస్తున్నాయి. అరటికాయల మార్కెట్‌లో చక్కెరకేళికి మరింత డిమాండ్ పెరిగింది. ప్రతి సంవత్సరం మార్చి నెలలో చక్కెరకేళి గెలలకు ధర తక్కువగా ఉండటంతో రైతులు ఈ సంవత్సరం చక్కెరకేళి తోటలను తక్కువగా వేశారు. దీనికి తోడు కృష్ణానదికి వచ్చిన వరదలు కారణంగా చక్కెరకేళి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ సంవత్సరం చక్కెరకేళి గెలలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌కు చక్కెరకేళి గెలలు తక్కువగా రావటంతో గెలల ధరలు అమాంతంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కొల్లిపర మార్కెట్‌కు మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, అమరావతి, రావులపాలెం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి చక్కెరకేళి గెలలను పోటీలు పడి కొనుగోలు చేస్తున్నారు. నెల రోజుల క్రితం చక్కెరకేళి అరటిగెల ధర మొదటి రకం 130 రూపాయల నుంచి 180, రెండోరకం 100 నుం చి 150 రూపాయలు ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం చక్కెరకేళి ధర 350 రూపాయల నుంచి 400 రూపాయల వరకు, రెండో రకం 200రూపాయల నుంచి 270 వరకు ధర పలుకుతోంది. దీంతో అరటి తోటలు ఉన్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో కొంత మంది వ్యాపారస్తులు చక్కెరకేళి గెలలను తోటల్లోనే కొనుగోలు చేసి మినీలారీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. రైతులు కూడా ఖర్చులు తగ్గుతాయని తోటల్లోనే గెలలను అమ్మటానికి సిద్ధపడుతున్నారు.



మినీలారీకి ఎగుమతి చేస్తున్న చక్కెరకేళి గెలలు

సంక్షేమం.. సులభం

(5వ పేజీ తరువాయి)

గణనీయ సంఖ్యలోనే ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 5,58,327 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 5,58,257 నివాసాలు జియోట్యా గింగ్ పూర్తయింది. గుంటూరు జిల్లాలో 7,42,211 ఉండగా ఇంకా 5,023 నివాసాలు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 7,09,831 ఇళ్లకు 13,237 ట్యాగ్ చేయాల్సి ఉంది.

వైసీపీ హయాంలో లూటీ

సంక్షేమ పథకాలను పెద్దఎత్తున అమలు చేస్తున్నామనే నెపంతో ప్రభుత్వ ధనాన్ని గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు లూటీ చేశారు. ఇదే విషయంలో గతంలోనే పలు సర్వేల్లో బట్టబయలైంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలలో దుర్వినియోగానికి సంబంధించి పెద్దఎత్తున విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. వివిధ విభాగాలలో జరుగుతున్న క్షేత్ర స్థాయి విచారణలో ఈ డేటాను సహాయకారిగా వాడుకుంటూ నిజాలు నిగ్గుతేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత ఏలుబడిలో ఎంతమేర నిధులు అర్హత లేని వారికి దోచిపెట్టారో తెలుసుకోవడంతో పాటు, ఆ ఏడాది ముగిసేలోగానే ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే ఆదేశాలు జిల్లా అధికారులకు వచ్చాయి.

జియోట్యాగింగ్‌లో జాప్యం..

జియోట్యాగింగ్ గతేడాది నవంబరులో మొదలైన ఈ జియో ట్యాగింగ్ డిసెంబరు చివరికల్లా ముగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏడాది మారి రెండు నెలలు దాటినా ఇంకా ప్రక్రియ సాగుతూనే ఉంది. సరిపడా సిబ్బంది లేకపోవడం, కొంతమంది సిబ్బందికి సహకరించకపోవడం, ప్రణాళికా లేమితో వందశాతం జియో ట్యాగింగ్ జరగలేదు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జియో ట్యాగింగ్ అనేసరికే చాలామంది విముఖత చూపుతున్నారని, వారికి అవగాహన కల్పించి ప్రక్రియ చేపట్టేసరికి ఆలస్యం అవుతుందనేది సిబ్బంది వాదన. కొంతమంది అందుబాటులో లేకపోవడం తోడు గత ప్రభుత్వంలో ఇష్టారీతిన ఇళ్ల నమోదు కూడా జాప్యానికి కారణంగా ఉందని యంత్రాంగం వాపోతోంది.

మానవత్వంతో సేవలందించండి

- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ నరసింహం ఉద్బోధ
- ఘనంగా జీఎంసీ 74వ స్నాతకోత్సవం

గుంటూరు మెడికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో నైతిక విలువలు ముఖ్యమని, వైద్యులు మానవతా ధృక్పథంతో రోగులకు సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉప కులపతి, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పిలుపునిచ్చారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కళాశాల 74వ స్నాతకోత్సవం 'కార్డియా 25'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ స్నాతకోత్సవంలో 2019 బ్యాచ్ విద్యార్థులకు వైద్య పట్టాలను వీసీ ప్రదానం చేశారు. తొలుత వీసీ డాక్టర్ నరసింహం, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి, ప్రభుత్వాస్పత్రి సూప రింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభించారు. వైద్యరంగంలో కృత్రిమ మేధ, రోబోటిక్ సర్జరీ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నా, రోగులపట్ల ప్రేమతో వైద్యం అందించే డాక్టర్లకు అవి ప్రత్యా మ్నాయం కాబోవని డాక్టర్ నరసింహం తెలిపారు. వ్యాధికి చికిత్స చేస్తున్నట్లు భావించకుండా, రోగికి చికిత్స చేస్తున్న విషయం గుర్తుంచుకుంటే తప్పనిసరిగా వారు వైద్య వృత్తిలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి మాట్లాడుతూ వైద్య రంగం వ్యాపారంగా మారిందని, చాలా మంది వైద్యులు కఠినంగా, యంత్రాల్లా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులను డబ్బులు వసూలు చేసే యంత్రాల్లా భావించడం సమంజసంకాదని వారి పట్ల ప్రేమతో, దయతో సేవలు అందించాలని కోరారు.

రూ.100 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్..

సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ జీఎంసీలో చదివి అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ మాతృ విద్యా సంస్థ కోసం జీజీహెచ్‌లో రూ.100 కోట్లతో నిర్మిస్తున్న ఎంసీహెచ్ బ్లాక్ 2026 జనవరి నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ బ్లాక్‌లో అవసరమైన వైద్య పరికరాలను రూ.40 కోట్లతో కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులకు డీఎంఈ డాక్టర్ నరసింహం పట్టా లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైద్య వృత్తి ప్రమణా లను కాపాడతామని, రోగుల పట్ల దయతో, ప్రేమతో వ్యవహ రిస్తామని వారితో హిపోక్రాటిక్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ శ్రీధర్, డాక్టర్ కే ప్రభాకరరావు, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ వీవీ హనుమంతరావు పాల్గొన్నారు.



కళాశాల ప్రాంగణంలో యువ వైద్యుల ఆనందహేళ





జ్యోతిప్రజ్వలన చేస్తున్న వైస్‌చాన్సలర్ డాక్టర్ నరసింహం

12న మహా ధర్నాను జయప్రదం చేయండి

తాడికొండ,మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకోసం ఈనెల 12న విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. మంగళవారం ఎస్సీ కాలనీలో మహాధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు.

పశ్చిమ డెల్టా కాల్వకు నీరు

దుగ్గిరాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1016 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివి జన్ నుంచి రేపల్లె కాల్వకు 126, తూర్పుకాల్వకు 119, పశ్చిమకాల్వకు 85, నిజాం పట్నంకాల్వకు 55, కొమ్మమూరుకాల్వకు 588 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల, మార్చి 4: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 66 బస్తాల పసుపును రైతులు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,300, గరిష్ఠ ధర రూ.8,500, మోడల్‌ధర రూ.8,500 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,300, గరిష్ఠ ధర రూ.8,500, మోడల్‌ధర రూ.8,500 పలికాయి.

పౌష్టికాహారంతోనే మెరుగైన జీవన విధానం

కాకుమాను, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే మహిళలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన జీవన విధానం సాధ్యమవుతుందని పాండ్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. మండలపరిధిలోని కొల్లిమర్లలో మంగళవారం అంతర్జాతీయ మహిళ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. మహిళల్లో రక్తహీనత సమస్య పరిష్కారానికి చిరుధాన్యాలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం తదితర అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండటానికి పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ కళావతి తెలిపారు. మంగళవారం తాడి కొండ-1లోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా హెల్దీ ఉమెన్.. హేపీ ఉమెన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ ఆరోగ్యానికి చిరు ధాన్యాలు, మునగాకు, ఆకుకూరలు, తాజా కూరగా యాలు, పాలు, పండ్లు, విటమిన్-సీ, ఐరన్ ఉండే అహారం తీసుకోవాలన్నారు. యోగా వల్ల మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. తల్లులు, కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎం.వీ సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్

తాడికొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాడికొండ మండల పంచాయతీ కార్యదర్శుల అధ్య క్షుడిగా లాం పంచాయతీ సెక్రటరిగా పనిచేస్తున్న డీ అరుణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించి పంచాయతీ కార్యదర్శుల కమిటీని ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా తాడికొండ పంచాయతీ కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జనరల్ సెక్రటరిగా ఎస్కే ఎం షరీఫ్, ట్రెజరర్‌గా ఎస్కే రెహమాన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీ లీలాప్రసన్న, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం మల్లీశ్వరి, పబ్లిసిటీ సెక్రటరిగా ఎన్ అనిల్, జాయింట్ సెక్రటరిగా ఎం సౌజన్యను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యుల జాబితాను ఎంపీడీవో సమతావాణికి అందజేశారు.

గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, మార్చి 4:(ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని కొలనుకొండ హైవే వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని తాడేపల్లి పోలీసులు మంగళవారం కనుగొన్నారు. మృతుడికి సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, ఒంటి మీద బూడిద రంగు జీన్స్ ప్యాంటు, ఛాతీపై హిందీలో పచ్చబొట్టు, కుడి చేతి భుజంపై తెలుగుర్తు పచ్చబొట్టు ఉన్నాయని, ఆచూకీ తెలిసిన వారు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

దుగ్గిరాల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియా, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎస్ వెంకటరవి అన్నారు. దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వెంకటరవి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లా డుతూ ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నా, విద్యార్థినులకు ఈవ్‌టీజింగ్ వంటి ఇబ్బందికర సమస్య లున్నా, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణకోసం 100కు లేదా 1930కు డయల్ చేయాలన్నారు. రైటర్ శ్రీనివాస్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ఓపెన్ హౌస్ కార్యక్రమంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటరవి

మంగళగిరి రైల్వే స్టేషన్‌కు మహర్దశ



తూర్పుముఖంగా రైల్వేస్టేషన్ కొత్త ఎలివేషన్ (నమూనా చిత్రం)

- రూ 12.6 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ
- కొత్తగా పశ్చిమ ప్రవేశ ముఖద్వారం ఏర్పాటు
- అమృత్‌తో ఆకర్షణీయంగా మారనున్న స్టేషన్

ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మంగళగిరి రైల్వే స్టేషన్ ఎంపికైంది. దీంతో త్వరలోనే స్టేషన్ రూపు రేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అమృత్ భారత్ పథకం కింద మంగళగిరి రైల్వే స్టేషన్‌కు సుమారు రూ.12.6 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో స్టేషన్‌ను సమూలంగా ఆధునీకరిస్తున్నారు. 1900 సంవత్సరానికి ముందే వున్న మంగళగిరి రైల్వే స్టేషన్ వందేళ్లకు పైగా ఎలాంటి చెప్పుకోదగ్గ మార్పు చేర్పులకు, అభివృద్ధికి నోచుకోలేదు. అమృత్ భారత్ స్టేషన్ పథకంతో మంగళగిరి రైల్వే స్టేషన్‌కు మహర్దశ వచ్చినట్టే..

మంగళగిరి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ కింద వున్న మంగళగిరి రైల్వేస్టేషన్ గత దశాబ్దకాలంగా చాల బిజీ స్టేషన్‌గా మారిపోయింది. ముఖ్యంగా రాజధాని ఈ ప్రాంతానికే రావడం, రాజధాని ప్రాంతానికి చేరువలో వున్న ఏకైక ముఖ్య రైల్వేస్టేషన్ మంగళగిరే కావడంతో స్టేషన్ రద్దీ పెరుగుతున్నప్పటికీ సౌకర్యాలు మాత్రం నామమాత్రంగానే వున్నాయి. వందేళ్లకు పైబడి కేవలం తూర్పు ముఖద్వారాన్ని మాత్రమే కలిగి వున్న ఈస్టేషన్‌కు కొత్తగా పశ్చిమ ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్టేషన్‌కు రెండు వైపులా ప్రవేశమార్గాలు ఉంటాయి. నిజానికి తూర్పు ముఖద్వారాన్ని అటువైపుగా వున్న స్టేషన్ మాస్టర్ కార్యాలయ భవనం, ఒకటో నెంబరు ఫ్లాట్‌ఫారాన్ని ఆధునీకరిస్తూ స్టేషన్‌కు దారితీసే మార్గాన్ని సైతం స్వాగత ద్వారం, సెంట్రల్ లైటింగ్‌తో బ్రహ్మాండంగా ఆధునీకరిస్తున్నారు. తూర్పు, పశ్చిమ ప్రవేశమార్గాలకు ఎదురుగా పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పశ్చిమంగా నిర్మిస్తున్న రెండంతస్తుల భవనంలో దిగువన క్యాంటీన్, ఎగువన టికెట్ కౌంటర్, వెయిటింగ్ హాలు వంటి సౌకర్యాలను కల్పిస్తారు.



4వ నెంబర్ ఫ్లాట్‌ఫాం విస్తరిస్తున్న దృశ్యం

ఒకటి, నాలుగు ఫ్లాట్‌ఫారంల అభివృద్ధి

స్టేషన్‌లో నాలుగు ఫ్లాట్‌ఫారాలు వున్నప్పటికీ ఒకటి, నాలుగు నెంబర్‌లు కల ఫ్లాట్‌ఫారాలను మాత్రమే ప్రస్తుతానికి వినియోగిస్తున్నారు. అందుకే ఈ రెండు ఫ్లాట్ ఫారాలను విస్తరిస్తున్నారు. ఈ ఫ్లాట్‌ఫారాల తాలూకు ఫ్లోరింగ్‌ను కూడ గ్రానైట్ టైల్స్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఒకటి నుంచి నాలుగుకు నాలుగునుంచి ఒకటవ ఫ్లాట్ ఫారంకు చేరుకునేలా వంతెన సౌకర్యాన్ని కల్పించడంతోపాటు ఆయా ఫ్లాట్‌ఫారాలపై లిఫ్ట్ సౌకర్యాలను కూడ ఏర్పాటు చేశారు. అలాగే ఒకటవ నెంబరు ఫ్లాట్‌ఫారం మీద కోచ్ ఇండికేషన్ సిస్టమ్‌ను కల్పిస్తున్నారు.

రోజుకు 34 రైళ్లు

మంగళగిరి రైల్వేస్టేషన్ మీదుగా రోజూ యాభైకి పైగా రైళ్లు నడుస్తున్నప్పటికీ వాటిలో 34 రైళ్లు మాత్రమే ఈ స్టేషన్‌లో ఆగుతున్నాయి. వీటిలో సుమారు ఇరవై వరకు వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వున్నాయి. ప్రత్యేకించి నర్సపూర్, సర్కార్, రాయగడ, సింహాద్రి, గోల్కొండ, హుబ్లీ, ఇంటర్‌సిటీ వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇక్కడ హాల్ట్ వుంది. ఎయిమ్స్ ఆసుపత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 85 శాతం హెచ్‌వోడీ కార్యాలయాలన్నీ మంగళగిరిలోనే వున్న దృష్ట్యా మంగళగిరిలో అన్నీ రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



తూర్పు వైపు సెంట్రల్ లైటింగ్‌తో ప్రవేశద్వారం

రాజధాని గ్రామాల్లో తాగునీటి కష్టాలకు చెక్

- ఏడు గ్రామాల్లో వివిధ పనులకు రూ. 5.70 కోట్లు కేటాయించిన సీఆర్డీఏ
- తుళ్లూరులో రూ. 45 లక్షలతో తాగునీటి ట్యాంకు నిర్మాణం



తుళ్లూరులో జరుగుతున్న వాటర్ ట్యాంక్ ఫౌండేషన్ పనులు

తుళ్లూరు, మార్చి4 (ఆంధ్రజ్యోతి) రాజధాని గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణ కోసం సీఆర్డీఏ ప్రణాళికలు సిద్ధంచేసింది. ఇందులో భాగంగా మొదట విడతగా ఏడు గ్రామాలలో తాగు నీటి సమస్య నివారణ కోసం రూ.5.70 కోట్లు కేటాయించింది. మండల కేంద్రం తుళ్లూరులో రూ.45 లక్షలతో ఫిల్టర్ సంపు, లక్షా 20 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మాణ పనులను శివాలయం వెనక ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రారంభించారు. నేలపాడులో ఫిల్టర్ బెడ్, పైపులు వేసే పనులు, నెక్కల్లు, మందడం, మల్కాపురం వెలగపూడి గ్రామాల్లో పాడైపోయిన పైపులు మార్చటం, కొత్త పైపులు వేయటంవంటి పనులకు మిగిలిన నిధులు కేటాయించటానికి అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే తుళ్లూరులోని రెండు వాటర్ ట్యాంకులుండగా, 90 లీటర్ల సామర్థ్యం గల పాతట్యాంకు శిధిలావస్థకు చేరుతోందని, మరమ్మతులుచేస్తే కొన్నేళ్లు వినియోగించుకోవచ్చని సీఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల పరిశీలించి నిర్ధారించారు. సాయిబాబా గుడి వద్దనున్న కొత్త ట్యాంకు రెండు లక్షల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పుడు సీఆర్డీఏ నిర్మించే మూడవ కొత్త ట్యాంకు అందుబాటులోకి వస్తే మండల కేంద్రం తుళ్లూరుకు తాగు నీటి సమస్య పూర్తిగా తీరుతుందని అధికారులు చెపుతున్నారు. తాగు నీటికష్టాల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలకు పూనుకొని నిధులు కేటాయించటంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి

మంగళగిరి సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణ, మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీ ఎంఎస్ఐడీసీ కార్యాలయంలో మంగళవారం ఆయన రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళగిరిలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు, అభివృద్ధిపై చర్చించారు. టెండర్లు, కాంట్రాక్టులను సింగిల్ విండో విధానంతో సులభతరం చేయాలన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా నిర్మించిన వైద్య కళాశాలలో, నాబార్డు నిధులతో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై చర్చించారు. సమావేశంలో ఏపీ ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా, చీఫ్ ఇంజనీరు కే.శ్రీనివాసరావు, జీ.సుధాకర్‌రెడ్డి, పీ.హర్షవర్ధన్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

వట్టిచెరుకూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులు, రవాణా,పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ద్విచక్రవాహన దారుడితో పాటు వెనుక ఉన్న వ్యక్తి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్‌తోపాటు జరిమానా భారీగా ఉంటాయని వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావులు వాహనదారులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినా, వాహనం వేగంగా నడిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నారులకు వాహనాలు ఇస్తే సీజ్ చేస్తాం

మండలపరిధిలోని కొన్ని గ్రామాల్లో చిన్న పిల్లలు శరవేగంగా వాహనాలు నడపటమే కాకుండా వెనుక మరో ఇద్దరు చిన్నారులను ఎక్కించుకొని వాహనాలు నడుపుతున్నారని, అలాంటి వారి వాహనం సీజ్ చేయటంతో పాటు పెద్దలపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సుబ్బారావు హెచ్చరించారు.

బడ్జెట్‌తో సామన్యులకు ఒరిగిందేమీలేదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పెదనందిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఎద్దేవా చేశారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం ఆదాయాన్ని 21వేల కోట్ల నుంచి 27వేల కోట్లు పెంచాలని ప్రతిపాదించారని, మద్యపానాన్ని నియంత్రించకుండా దానిని ఆదాయంగా చూపడం సమంజసం కాదన్నారు. బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, 26వేల కోట్లు అవసరం కాగా 9400 కోట్లు మాత్రమే వ్యవసాయానికి కేటాయించారన్నారు. గుంటూరు ఛానెల్‌కు 400 కోట్లు అవసరం కాగా మొక్కుబడిగా 100కోట్లు కేటాయించి ఏదో చేసినట్లుగా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నల్లమడ వాగు ఆధునీకరణ చేపట్టి ఈ ప్రాంత వరద ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, కొత్త వెంకటశివ, రామారావు, ఆశీర్వాదం, మర్రి లక్ష్మీ పాల్గొన్నారు.

టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కాకుమాను, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఉపయోగపడే టీకాల గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట్రావు, సువార్తమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని ఏకాదశ దీక్షల స్వీకరణ

మంగళగిరిసిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి పర్వతాన కొలువైన పానకాలస్వామి సన్నిధిలో పలువురు భక్తులు మంగళవారం నృసింహుని ఏకాదశ మాలధారణా దీక్షలు స్వీకరించారు. నృసింహాలయ ఉపప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు భక్తులకు మాలధారణచేశారు. లక్ష్మీనరసింహ స్వామివార్ల సేవాట్రస్టు ఆధ్వర్యంలో మాలధారులకు ఉచితంగా దీక్షా వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, గురుస్వామి శివారెడ్డి, గోగినేని వెంకటేశ్వరరావు, గాజుల శ్రీనివాసరావు, రంగిశెట్టి లక్ష్మీసైదానాయక్, రామకృష్ణారెడ్డి, బుర్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ ఇన్సూరెన్స్‌తో ఆర్థిక భరోసా

పెదనందిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారి లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకోవడం వల్ల ఆర్థిక భరోసా కలుగుతుందని గుంటూరు ఎస్‌బీఐ లైఫ్ ఏజెన్సీస్ మేనేజర్ కె.లాజర్ అన్నారు. మండలపరిధిలోని నాగులపాడులో గ్రామస్థులకు మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు చేసుకున్న నగదుతో ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకోవడం ద్వారా ప్రమాదం జరిగి మరణిస్తే తమ కుటుంబానికి ఇన్సూరెన్స్ ఆసరాగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పెదనందిపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తల్లులు తమ చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలపరిధిలోని పమిడివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

డొంకరోడ్ల నిర్మాణంతో రైతుల్లో ఆనందం

దుగ్గిరాల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో దశాబ్ద కాలానంతరం డొంక రోడ్ల నిర్మాణంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నేళ్లుగా డొంకరోడ్లు గుంతలమయమై, వర్షం వస్తే బురద సమస్యతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, అరటి, పసుపు, బొప్పాయి, తదితర వాణిజ్య పంటలను తరలించే లారీలు సైతం ఇరుక్కుపోయి, రైతులు నానా అవస్థలు పడినప్పటికీ పట్టించుకునే వారు లేక పోయారు. ఎన్నికల ప్రచారంలో నారా లోకేశ్ గ్రామ రైతులకిచ్చిన హామీ మేరకు డొంకరోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. 25 లక్షల ఉపాధిహామీ పథకం కింద రూ.11లక్షలతో 1000మీటర్ల డొంక రోడ్డు, రూ.14లక్షలతో 1200 మీటర్ల డొంకరోడ్డు నిర్మాణం ఇటీవల పూర్తిచేశారు. మంత్రి నారా లోకేశ్ యిచ్చిన హామీ నిలబెట్టుకున్నారంటూ కృతజ్ఞతలు తెలిపారు.



రేవేంద్రపాడులో పొలాల మధ్య పదేళ్ల సుదీర్ఘ విరామానంతరం నిర్మించిన డొంకరోడ్డు



నాగులపాడులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నేతలు

ఆలపాటి గెలుపుపై టీడీపీ నేతల హర్షం

- వివిధ ప్రాంతాల్లో కూటమి శ్రేణుల సంబరాలు

పెదనందిపాడు, మార్చి, 4 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నాగులపాడులో మంగళవారం గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు విజయోత్సవ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు భీమినేని రవి, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆళ్ల నాగేశ్వరరావు, సభ్యుడు బండి జయచంద్రశేఖర్, నాయకులు పాటిబండ్ల నాగరాజు, ఎం నాగేశ్వరరావు, కె సురేష్, సందిరెడ్డి ఉమామహేశ్వరరావు, ఎన్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడులో డ్వాక్రా మహిళలు కేక్ కట్ చేసి, ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుంటుపల్లి సీతామహాలక్ష్మీ, శివకుమారి, నిమ్మగడ్డ సుమతి, యలమంచి సంపూర్ణ, పాటిబండ్ల పద్మ, కుందేటి పద్మ, కృష్ణవేణి, కట్టా రమాదదేవి, గద్దె రోజారాణి, మల్లీశ్వరి, ఆలపాటి యోగి, తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి): ఆలపాటి గెలుపునకు కృషి చేసిన టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలకు టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణ చంద్రరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, బీజేపీ అధ్యక్షుడు కారుమూరి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్,(ఆంధ్రజ్యోతి): టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభేని వెంకట్రావు, రూరల్ అధ్యక్షుడు అమరా సుబ్బారావుల ఆధ్వర్యంలో ఆయా టీడీపీ కార్యాలయాలు ముందు బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ విజయోత్సవ వేడుకలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు లైబ్రరి సెంటర్‌లో టీడీపీ శ్రేణులు బాణా సంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, తాడికొండ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, నాయకులు జమ్ముల అనిల్, గడ్డం వెంకటేశ్వరావు, రాజేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో అధ్వాన రోడ్లకు మోక్షం

- రహదార్ల అభివృద్ధిపై మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి
- మూడు రోడ్లకు రూ.9.86 కోట్లు విడుదల

మంగళగిరి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అధ్వా నంగా తయారైన రోడ్లకు మోక్షం లభించనుంది. మంగళగిరి నియో జకవర్గంలో రహదార్ల అభివృద్ధిపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిం చడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదార్ల సమ స్యలపై ప్రజలు, ప్రజా సంఘాలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికా రుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యం. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ చొరవతో మంగళగిరి నియోకవర్గంలో మూడు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.9.86 కోట్లు మంజూరయ్యాయి. దుగ్గిరాల - కొల్లిపర, ఉండవల్లి - ఎర్రబాలెం వయా పెనుమాక రోడ్డు, దుగ్గిరాల-పెదపాలెం రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ కింద రూ.9 కోట్ల 86 లక్షలను విడుదల చేసింది. దుగ్గిరాల-కొల్లిపర మధ్య 4 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.2.86 కోట్లు, ఉండవల్లి-ఎర్రబాలెం మధ్యన 6.45 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.5 కోట్లు, దుగ్గిరాల-పెదపాలెం మధ్యన 3 నుంచి 6.2 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించింది. తాజాగా నిధుల విడుదలతో ఆయా గ్రామాల మధ్య రహదార్ల అభివృద్ధి జరుగనుంది.



క్రీడాకారులను అభినందించి సత్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

యువత భవితకు క్రీడలు దోహదం

- శాప్ చైర్మన్ రవి నాయుడు
- క్రీడాకారులకు అభినందన

తాడేపల్లి టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): యువత భవితకు క్రీడలు దోహదపడతాయని, క్రీడలను ప్రోత్సహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఉత్తరాఖండ్ వేదికగా జనవరి 28న నుంచి ఫిబ్రవరి 14వ తేది వరకు జరిగిన 38వ జాతీయ క్రీడల్లో భాగంగా కెనో స్లాలమ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన నగిడి గాయత్రి, 3వ స్థానంలో నిలిచిన డి.చేతన భగవతి, 4వ స్థానంలో నిలిచిన నగిడి రాజేష్‌లు మంగళగిరి నియోజకవర్గం కొలనుకొండలోని శాప్ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో రవినాయుడిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత క్రీడాకారిణి గాయత్రి మాట్లాడుతూ జాతీయ పోటీల్లో బంగారు పతకం సాధించానని, ఈ నెల 7నుంచి 12వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరిగే ఏషియన్ ఛాంపియన్‌షిప్ కెనో స్లాలమ్ పోటీల్లో పాల్గొననున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శాప్ చైర్మన్ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ రాజశేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో డీన్ డీడీ స్మిత్, సర్పంచ్ సైదా తదితరులు

గ్రామీణ జీవన విధానంపై అధ్యయనం చేయాలి

- బాపట్ల అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డీన్ డీడీ స్మిత్

కాకుమాను, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల జీవన విధానాలపై విద్యార్థులు అధ్యయనం చేయాలని బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల డీన్ డీడీ స్మిత్ విద్యార్థులకు సూచించారు. మండలపరిధిలోని రేటూరు, అప్పాపురం గ్రామాల్లో మంగళవారం బాపట్ల అగ్రికల్చరల్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గ్రామాల్లో ప్రజలను కలిసి వారి వృత్తి, తదితర అంశాల డేటాను స్వీకరించారు. తొలుత రేటూరులో జరిగిన ప్రారంభోత్సవంలో సర్పంచ్ సైదా మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం ప్రధాన వృత్తి అన్నారు. వ్యవసాయం ఫలసాయం కావాలంటే ప్రభుత్వాలు రాయితీలు కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ సర్దార్ బేగ్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ విజయకుమార్, లావణ్య, కళాశాల సిబ్బంది రవిబాబు, హెచ్‌వీ హేమకుమార్, రామిరెడ్డి పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఘనంగా రెయిన్‌బో ట్రస్ట్ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్ రెయిన్‌బో ట్రస్ట్ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, సహాయ రవాణా శాఖాధికారి జి.అమృతరాణిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమ మాట్లాడుతూ, మహిళల ప్రగతికి ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అందిస్తున్న సేవలు విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జీవనలత, లక్ష్మీఅలేఖ్య, వరలక్ష్మి, జ్యోతి, లీలారాణి, సృజన, అనూరాధ, రత్నశ్రీ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ మేనేజర్ చండీ దేవసేన బదిలీ

తెనాలి మారీసుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘంలో మునిసిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రెడ్డి చండీ దేవసేన పదోన్నతిపై బదిలీ అయ్యారు. మంగళవారం పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ మేనేజర్ చండీ దేవసేన పదోన్నతిపై బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆమెకు అభినందన సభను మునిసిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నలు పాల్గొని చండీదేవసేనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ, ఆర్‌వో రాంప్రసాద్, కౌన్సిల్ సభ్యులు, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి జీవధ్వజ, శిఖర ప్రతిష్ఠ పూజలు

తెనాలి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీగోవర్ధన స్వామి, శ్రీవీర ప్రతాప ఆంజనేయ స్వామి వార్ల దేవాలయాల ప్రాంగణంలో ఈ నెల 7 నుంచి 10వరకు శిఖర ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమల తిరుపతి దేవస్థానం వేద పాఠశాల వైఖానస ఆగమ అధ్యాపకులు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు, దేవదాయ శాఖ ఉపకమిషనర్ కేబీ శ్రీనివాస్ పాల్గొననున్నారు. ఈ నెల 9న గోవర్ధన స్వామివారి జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, విమాన గోపుర మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, 10న శ్రీవారి శాంతి కల్యాణం, అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఆలయ ధర్మకర్తలు ఎస్‌బీ శివ, కె.భాస్కర రావు వంశపారంపర్య అర్చకులు ఈ ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొంటున్నట్లు ఆమె తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన అధ్యక్షుడిగా జీ శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ప్రశాంతి ఎన్నికయ్యారు. కార్యదర్శుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్ సూచనలు మేరకు నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించినట్లు చెప్పారు. కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడం కలసికట్టుగా పని చేయడమే లక్ష్యంగా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగినట్లు అధ్యక్షుడు శ్రీనివాసరావు వివరించారు.

ఇన్ఫోసిస్‌కు ఏఎస్‌ఎన్ విద్యార్థుల ఎంపిక

తెనాలి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల విద్యార్థులకు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. అక్కడ ఎంపికైన 29మంది విద్యార్థులలో తమ కళాశాలకు చెందిన 13మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సంవత్సరానికి రూ.3 లక్షల వేతనం లభిస్తుందని కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు అభినందించారు.

త్వరలో అందుబాటులోకి శుద్ధి ప్లాంట్

మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి మారీసుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యర్థ జలాలను శుద్ధి చేసేలా నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ సేవలను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మంగళవారం స్థానిక పూలే కాలనీలో నూతనంగా నిర్మించిన మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను కమిషనర్ బండి శేషన్న సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలో నుంచి వ్యర్థ జలాల డ్రెయిన్లను శుద్ధి ప్లాంట్‌కు అనుసంధానం చేసిన డ్రెయిన్లలోని మురుగునీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డుల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధిప్లాంట్ ద్వారా శుద్ధిచేసి పర్యావరణానికి హాని కలగకుండా పంట పొలాలకు ఇతరత్రా అవసరాలకు వినియోగించుకునేలా ప్లాంట్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్లాంట్ పనులు తుదిదశకు చేరుకున్నాయని అతి త్వరలోనే ప్లాంట్‌ను ప్రారంభించి దీని సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు,



శుద్ధిప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలపాటి విజయంపై కూటమి నేతల హర్షం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి రూరల్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీగా సీటు కల్పించి ఆయనకు తగిన గౌరవం ఇచ్చారని టీడీపీ శ్రేణులు కృతజ్ఞతలు తెలుపుతూ క్షీరాభిషేకం చేశారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన సందర్భంగా పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ సెల్ అధ్యక్షుడు గిరి గణేష్ మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఘన విజయంతో గెలిపించిన పట్టభద్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ మాట్లాడుతూ ఆలపాటి గెలుపుకోసం పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై ఉన్న నమ్మకంతో పట్టభద్రులందరూ భారీ మెజార్టీతో వారికి కృతజ్ఞతలు తెలపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వి.సులోచన, వై.పద్మజ,రాఘవరావు, రవీంద్ర, వెంకటేశ్వరరావు పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సభ్యుల...



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తెనాలి క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి ఘన విజయంపై తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కోర్టు ప్రాంగణం వద్ద జరిగిన కార్యక్రమంలో సభ్యులు స్వీట్లు పంపిణీ చేసి సంతోషం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు మాట్లాడుతూ, ఆలపాటి మొదట న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీశంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఆర్.అనిత, సీహెచ్ శారద, బొంతా వీరాంజనేయులు, జైప్రకాష్, అప్పల కిషోర్‌కుమార్, హరీష్, టి.కొండయ్య, నన్నపనేని రవికృష్ణ, ఫణిబాబు, కోటేశ్వరరావు, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడంతో మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అత్యధిక మెజార్టీతో గెలవటంతో టీడీపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, బొంతు చంద్రిక, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, షేక్ రఫీ, ఆరిమండ వెంకటరెడ్డి, జంగా శ్రీనివాసరెడ్డి, గోల్లా ప్రసాద్, గుదిబండి వీరారెడ్డి, జొన్నల నాగిరెడ్డి, జొన్నల శ్రీనివాస రెడ్డి, తమ్మా రామిరెడ్డి, షేక్ ఇర్ఫాన్, కేసన పోతురాజు, పొండేటి ఏసు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో పలు దుకాణాల్లో చోరీలు



వైన్ షాపులో విచారణ చేస్తున్న అర్బన్ పోలీసులు

పొన్నూరు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని పలు దుకాణాలలో చోరీలు జరిగిన సంఘటనపై మంగళవారం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పొన్నూరు పట్టణంలోని బాపట్ల బస్టాండ్ సమీపంలోని రష్మిక వైన్స్‌లో అర్ధరాత్రి దుండగులు చొరబడి సీసీ కెమెరా, వైర్‌లు కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. అలాగే సమీపంలోని సత్య గ్రాండ్ బజార్ సూపర్ మార్కెలో కూడా చోరీ జరిగింది. షట్టర్ తాళాలు పగలకొట్టి షాపులోకి ప్రవేశించిన దుండగులు సుమారు రూ.20వేల నగదుతో పాటు విలువైన వస్తు వులు చోరీ చేశారు. వరస చోరీల సంఘటనలతో అర్బన్ పోలీసులు అప్రమత్తమై క్లూస్ టీంలను రప్పించి ఆధారాల కోసం శోధించారు. ఇటీవల ఈ దుకాణాలకు ఎదురుగా ఉన్న మద్యం దుకాణంలో కూడా ఇదే రీతిలో చోరీ జరిగింది. పొన్నూరు పట్టణంలో ప్రధాన కేంద్రం ఐలాండ్ సెంటర్‌లో జరుగుతున్న వరుస చోరీలు పోలీసులకు సవాళ్లుగా మారాయి. వరుస చోరీల సంఘటనలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొద్దిరోజుల క్రితం పట్టణంలో ఓ వ్యక్తి దుకాణంలోకి చొరబడి చోరీలకు పాల్పడ్డాడు, వరస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. పోలీసు అధికారులు వరుస చోరీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

పొన్నూరు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం పట్టణంలోని 23వ వార్డుకు చెందిన నక్కల మిల్టన్ పురపాలక సంఘంలో చిరుద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటిముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచాడు. మంగళవారం మిల్టన్‌కు చెందిన ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో చోరీకి గురైందని గుర్తించి అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అర్బన్ ఎస్‌ఐ శ్రీహరి కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, మలేరియా సబ్ యూనిట్ అధికారి బాలచంద్రమౌళి తదితరులు

గర్భిణులు పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలి

● వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

తెనాలి మారీసుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహార విలువలు కలిగిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక అన్నారు. మంగళవారం స్థానిక నందులపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక ఆశా డే కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులను సత్వరం నమోదుచేసి వారు పోషకాహారాన్ని తీసుకునేలా చూడాలని, వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా అందించాలన్నారు. డీపీఎంవో జంగం శ్యామ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్థులను సత్వరమే గుర్తించి వారికి చికిత్స అందించేలా తోడ్పడాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి అందే బాలచంద్రమౌళి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వలు లేకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిల్వ నీటిలో దోమల లార్వాలు అభివృద్ధి చెందకుండా మడ్డి ఆయిల్ పిచికారి చేసినట్లయితే దోమల అభివృద్ధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్లు ప్రసన్న, పుష్పలత, ఏఎన్ఎంలు తులసి, సుమతి, భువనేశ్వరి, జంషద్ బేగం, కొండమ్మ, నాగేశ్వరమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి మారీసుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిచారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీశివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి కార్యలయం వద్ద మంగళవారం సేవా సమితి సభ్యులు డాక్టర్ రఘురాం వీరమాసునేని వర్ధంతి సందర్భంగా పరుచూరి శ్రీనాథ్‌బాబు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఎం.వంశీ, పరుచూరి శ్రీనాథ్‌బాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా, తెనాలి మండలం, పెదరావూరు నివాసి. డోర్ నెం.6-63, యెనిగళ్ళ రంగనాయకులు తండ్రి శేషగిరిరావు ఆధార్ నెంబరు 5790 6030 4701, సెల్ నెంబరు 9000726847 తరుపున సంజాయిషీ పొంది ఈ దిగువ తెలిపిన విధంగా ప్రకటన చేయవలసినదిగా కోరడమైనది.

నా క్లయింటు తెనాలి పెదరావూరు గ్రామం నుండి తెనాలి రైల్వే స్టేషనుకు వెళుచుండగా హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా, చంపాపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన డి.నెం.14835/2003, సర్వే నెంబర్లు 125, 126 జలపల్లి గ్రామం పంచాయితీ సరూర్ నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లాకు చెందిన చ.గ. 407ల నవ నెంబరు ప్లాటుకు నివాస స్థలమునకు చెందిన విక్రయ దస్తావేజు 14835/2003, తేది. 10-12-2003గా రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ జిరాక్స్ నిమిత్తం ది.01-02-2025న తీసుకుని ఆటోలో రైల్వే స్టేషన్, బాలాజీరావుపేట తెనాలి వైపు వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పోయినవి. గాన దొరికిన వారు ఈ దిగువ అడ్రసుకు తెలియజేయగలరు.

గాదెలవర్తి ప్రభాకరరావు, న్యాయవాది, తెనాలి
సెల్ : 94400 39009

రైతులకు అండగా భారతీయ కిసాన్ సంఘ్

● రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబిరెడ్డి

కొల్లిపర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించడం కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంగా సాంబిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తూములూరులో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు జెండాను ఎగురవేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుధర లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కొండా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులకు రైతులే ధర నిర్ణయించుకునే రోజులు రావాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వింతా వేణుగోపాల్‌రెడ్డి, కన్నెగంటి విజయకుమార్, భీమవరపు బ్రహ్మారెడ్డి, బద్దిగం నాగిరెడ్డి, ఈదా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ స్థూలకాయ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్ సభ్యులు

స్థూలకాయం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

తెనాలి మారీసుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రజకపేటలోని చాకలి ఐలమ్మ పార్కులో మంగళవారం శబరి వెల్‌నెస్ సెంటర్ సభ్యులు ప్రపంచ స్థూలకాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 38వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి పాల్గొని ఒబేసిటీపై అవగాహన కలిగి ఉండాలని ఆహార నియమాలు పాటించాలన్నారు. నిద్రలేమి, తీపి పదార్థాలు, అధిక నిద్రవల్ల కూడా బరువు పెరుగుతారన్నారు. స్థూకాయం వలన బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి ఆనారోగ్య సమస్యల భారినపడే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో వెల్‌నెస్ సెంటర్ హెడ్ సుస్మిత, ఇషాద్‌ఖాన్, మాధవి, పార్వతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

● ఉపవిద్యాశాఖాధికారి శాంతకుమారి



రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈవో శాంతకుమారి

తెనాలి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణతో ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఉప విద్యాశాఖాధికారి జి.శాంతకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని కొలెవరం హైస్కూల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించిన రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. స్కూల్ డ్రాపవుట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహారంపై విద్యార్థులకు శాంతకుమారి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం టి. శ్రీధర్, స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ మందిరం నిర్వాహకులకు నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీ కృష్ణ మందిర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 4: మండల పరిధిలోని వేజెండ్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ మందిరానికి టీడీపీ నాయకులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సహకారంతో రూ.లక్ష విరాళాన్ని మందిర నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మీనారాయణ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరంకి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో సాయిబాబా నామ పారాయణం

తెనాలి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురులో సాయిబాబా సత్సంగకేంద్రంలో సాయిబాబా నామంతో సంకీర్తన పారాయణం భక్తిప్రపత్తులతో జరిపారు. మంగళవారం ఉదయం సాయిబాబా వారికి పూలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామ సంకీర్తన, హారతి, భజన బృందంతో గీతాలాపన జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నిర్వాహక సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో యూబీఐ ముందంజ: సీజీఎం వాసుదేవన్

తెనాలి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు రుణాలు మంజూరు చేయడంలో యూనియన్ బ్యాంకు ముందంజలో ఉందని ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ బీజు వాసుదేవన్ పేర్కొన్నారు. తాడిబోయిన వారి వీధిలోని బ్యాంకులో మంగళవారం సూక్ష్మరుణాల మంజూరు విధానంపై ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ, అన్ని రకాల వ్యాపార సంస్థలకు రుణాల మంజూరులో నిబంధనలను సరళతరం చేశామన్నారు. ఈ కార్యక్రమం కింద మంజూరు చేసిన రూ.3 కోట్లు మేరకు వ్యాపారులకు పత్రాలు అందజేశారు. బ్యాంకు అందిస్తున్న అన్నిరకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజనల్ మేనేజర్ జవహర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సమానత్వం - సాధికారతపై అవగాహన



అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ యామిని, రజియా తదితరులు

తెనాలి మారీసుపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తేలప్రోలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సూపర్‌వైజర్ కె.యామిని అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి సమానత్వం సాధికారత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన ఆహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వాటిని నిరోధించాలన్నారు. అనంతరం గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన ర్యాలీని నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ రజియా, షేక్ సూఫియా, నాగరత్నం, వహిదా తదితరులు పాల్గొన్నారు.